ప్రజాశక్తి
గురువారం 30 జనవరి, 2025
5
శ్రీకాకుళం

క్రీడల్లో రాణించాలి

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు మహారాష్ట్ర రాష్ట్రం నాగపూర్ పట్టణంలో 69వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అందులో జిల్లాకు చెందిన సింగూరు నందిని, ముంత గాయత్రి, బెండి జ్యోత్స్నలు ప్రతిభకనబర్చారు. వీరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పిని బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ... మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, కోచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

రబీ నిరాశాజనకం

- సాధారణ విస్తీర్ణం 1,98,493 ఎకరాలు
- ప్రస్తుతం 1,23,460 ఎకరాలు
- పంటల సాగు 62 శాతమే
- వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గిన సాగు

రబీలో ఈ ఏడాది పంటల సాగు అంత ఆశాజనంగా లేదు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో సాగు గణనీయంగా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తమ పంటలకు వంశధార నీళ్లు విడిచిపెట్టాలంటూ రైతులు ప్రజా ప్రతినిధులను కలిసి మొరపెట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

బూర్జ మండలం వై.పర్తలో ఇంజిన్‌తో నీరు పడుతున్న రైతు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రబీలో సాధారణంగా అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 1,98,493 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 1,23,460 ఎకరాల (62.20శాతం) మేర సాగైంది. వరి సాగు పరిస్థితి దయనీయంగా ఉంది. రబీలో వరి సాధారణ సాగు 21,573 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం 7.790 ఎకరాల్లో (36 శాతం) మాత్రమే వేయగలిగారు. రాగులు సాధారణ సాగు విస్తీర్ణం 5,155 ఎకరాలు ఉండగా, 3,158 ఎకరాల్లో సాగవుతోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా మొక్కజొన్న, కట్టె జనుము, వేరుశనగ పంటల సాగు పరిస్థితి కాస్తా పర్వాలేదనిపిస్తోంది. మొక్కజొన్న పంట సాగు పరిస్థితి కాస్తా బాగానే ఉంది. రబీలో సాధారణంగా 40,675 ఎకరాల్లో సాగవుతుండగా ఇప్పటివరకు 40,015 ఎకరాల విస్తీర్ణంలో (88 శాతం) సాగయింది. కట్టెజనుము సాధారణ సాగు 2,808 ఎకరాలు కాగా, 2,418 ఎకరాల్లో (86 శాతం) మేర సాగవుతోంది. మొక్కజొన్న పంటను రబీ సీజన్‌లో సాధారణంగా 10,485 ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు 7,930 ఎకరాల్లో (86శాతం) పంటలు వేశారు.

అపరాల సాగుపై తీవ్ర ప్రభావం

రబీ సీజన్‌లో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండటంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రాగులు, పెసర, మినప పంటలు 61 శాతం చొప్పున సాగయ్యాయి. రబీలో రైతులు సాధారణంగా 39,240 ఎకరాల్లో పెసర పంట వేసే పరిస్థితి ఉండగా, ఇప్పటివరకు 23,783 ఎకరాల్లో వేయగలిగారు. మినప పంట సాధారణ సాగు 60,753 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 37,175 ఎకరాల్లో సాగవుతోంది. నువ్వుల సాగు కూడా దారుణంగా ఉంది. సాధారణంగా 12,115 ఎకరాల్లో వేసే పరిస్థితి ఉండగా ఇప్పటివరకు రైతులు 3,618 ఎకరాల్లో (30 శాతం) మాత్రమే వేయగలిగారు.

మిగిలిన పంటలదీ అదే పరిస్థితి

పొద్దుతిరుగుడు పంట 553 ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, 15 ఎకరాల్లో (3 శాతం) మాత్రమే వేయగలిగారు. చెరకు పంట సాధారణ సాగు 2,755 ఎకరాలు సాగా ఇప్పటివరకు 255 ఎకరాల్లో (9 శాతం) మాత్రమే వేశారు.

తీవ్ర వర్షాభావ పరిస్థితులు

రబీ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబరులో సాధారణంగా 294.2 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా, 147.7 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వర్షపాతం 79.4 శాతం మేర లోటు ఉంది. నవంబరులో సాధారణ వర్షపాతం 99.2 శాతం కాగా, 7.1 శాతమే నమోదైంది. ఆ నెలలో 92.8 శాతం తీవ్ర లోటు ఉంది. డిసెంబరులో అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు బాగానే కురిశాయి. ఆ నెలలో 2.7 శాతం వర్షం కురవాల్సి ఉండగా, 101.1 మి.మీ వర్షం పడింది. జనవరిలో మాత్రం కనీసం చినుకు జాడ కనిపించలేదు. సాధారణంగా జనవరిలో 5.3 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా సున్నా శాతం వర్షపాతం నమోదైంది.

మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

- 3న నోటిఫికేషన్
- 27న పోలింగ్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు
- అమల్లోకి ఎన్నికల కోడ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శాసన మండలిలో ఖాళీగా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్‌ను వెలువరించింది. ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో ఆ స్థానానికి ఫిబ్రవరి 27న ఎన్నిక జరగనుంది. షెడ్యూల్ వెలువడడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ తక్షణం అమల్లో వచ్చింది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా...

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ కానుంది. 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ గడువుగా నిర్ణయించారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. మార్చి 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

బాలింతతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వివిధ సమస్యలపై ఆస్పత్రి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిని బుధవారం అకస్మికంగా సందర్శించారు. వైద్యుల హాజరు పట్టిక, రోగుల ఓపిని పరిశీలించారు. ఆస్పత్రికి ఎంతమంది రోగులు రోజూ వస్తున్నారని, ఆస్పత్రిలోని పరికరాలు పనిచేస్తున్నాయా? లేవా? అని ఆస్పత్రి సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనరల్ వార్డును, బాలింతల వార్డును పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలు గురించి, సమయానికి నాణ్యమైన ఉచిత భోజనం, మందులు, వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వైద్యం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వైద్యులు, సిబ్బంది రోగులపై సేవా దృకత్పథంతో పనిచేసి వారికి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, తర్ర రామకృష్ణ, బోయిన రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజలతో, అధికారులతో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ చేరువచేస్తామని వివరించారు. వివిధ సమస్యలపై వచ్చిన వినతులు వెంటనే పరిశీలించి, ప్రజాదర్బార్‌కు హజరైన అధికారులతో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి వెలమల కామేశ్వరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, కర్రి అప్పారావు, ఎన్.శ్రీనివాసరావు బోయిన రమేష్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన 'సిరిపురం'

జిల్లా బిజెపి నూతన అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు స్థానిక ఎన్‌టిఆర్ భవనలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రజల సంక్షేమానికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రవిబాబ్జి, రెడ్డి భాగ్యలక్ష్మి, మెట్ట తిరుమలరావు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసగాడు

- ఏడాది కాక ముందే కూటమి పనైపోయింది
- వైసిపి పాలనను గుర్తు చేసుకుంటున్న ప్రజలు
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- పలాస

ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా పథకాలు ఇవ్వలేమని ప్రకటించి నిలువునా మోసం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ దుయ్యబట్టారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌తో కలిసి అప్పలరాజు స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చారో, ఆ హామీలను నెరవేర్చలేమని, పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను చంద్రబాబు దగా చేశాడని ధ్వజమెత్తారు. సాక్షాత్తు సచివాలయంలోనే ఈ ప్రకటన చేయడం.. ఎలాంటి సంకోచం లేకుండా, భయం లేకుండా, వణుకు లేకుండా చంద్రబాబు మార్కు దగా మరోసారి రుజువు చేయడానికి ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్లాలంటే ఆలోచించే పరిస్థితులు దాపరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేసిన ప్రకటనతో కూటమీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ప్రజలను డైవర్షన్ చేయడానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వైసిపిపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి విమర్శలు మానుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడవకముందే కూటమి ప్రభుత్వం పనైపోయిందన్నారు. కోవిడ్ కష్టకాలంలో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మాజీ సిఎం జగన్ సంక్షేమ పథకాలు అందించారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టడమేనని తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు మరోసారి నిజమయ్యాయని అన్నారు. కూటమి 9 నెలల్లో రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చిందని, మరి అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారు? ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? అని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టి, పలాస-కాశీబుగ్గ పట్టణ వైసిపి అధ్యక్షులు సిస్ట్ గోపి, కోటబొమ్మాళి జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరమణ, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతరావు, హేమసుందర్‌రాజు, మాజీ ఎంపిపి బత్తిని హేమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గం బిసి విభాగం అధ్యక్షులు పి.బడగల బాలచంద్రుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే పిడిఎఫ్ ధ్యేయం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ బలపరచిన అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న ఆమెకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భాగస్వామ్య పక్షాల సహకారంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగ వ్యతిరేక నిర్ణయాలను అడ్డుకునేందుకు పోరాడుతున్న పిడిఎఫ్ బలాన్ని శాసన మండలిలో పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విజయగౌరికి మద్దతుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, సిఐటియు జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేకల తేజేశ్వరరావు, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గొంటి సురేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ యాదవ్, జన విజ్ఞాన వేదిక జిల్లా వ్యవస్థాపక కార్యదర్శి కొత్తకోట అప్పారావు పాల్గొన్నారు.

పశు నష్టపరిహారం అందజేత

పశుసంవర్ధకశాఖ జెడి రాజగోపాల్

మాట్లాడుతున్న రాజగోపాల్

పాతపట్నం : పశు నష్టపరిహార పథకం ద్వారా జిల్లాలో 13,42, 52,500 పాడి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కంచరాన రాజగోపాల్ అన్నారు. పాతపట్నం, మెలియాపుట్టి మండలాల్లో చేపడుతున్న పశువైద్య శిబిరాలను బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 4,553 ఆవు జాతి పాడిపశువులకు, 176 గేదజాతి, 1142 గొర్రెలకు మేకలకు ఈ నష్టపరిహారం అందిందన్నారు. ముఖ్యమంత్రి, పశుసంవర్ధకశాఖ మంత్రి వల్ల ఈ నష్టపరిహార పథకం పాడి రైతుల ఖాతాల్లోకి జమ అయ్యిందని చెప్పారు. జిల్లాలో ఈ నెల 20 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన 484 పశు వైద్య శిబిరాల్లో 27,595 సాధారణ వ్యాధులకు చికిత్సలు, 4,690 గర్భకోశ వ్యాధులకు, 14256 పెద్ద పశువులకు డీవార్మింగ్ మందులు, 738 కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు, 3237 చూడి పరీక్షలు, 13783 దూడలకు ఏలికి పాములు మందులు, 40,936 గొర్రెలకు మేకలకు అట్టలు నివారణ మందులు, 39570 మసూచి టీకాలు, 38056 కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ శిబిరాల ద్వారా 18,826 మంది పశుపోషకులకు లబ్ధి కలిగిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న పశుగ్రాసాల వైపు పాడి రైతులంతా దృష్టి సారించాలన్నారు. మినీ గోకులం నిర్మాణాలు ఎవరైతే 20 రోజుల్లో పూర్తి చేస్తామని లిఖితపూర్వకంగా వస్తారో వారికి మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వి.జయరాజు, జిల్లా సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం సహాయ సంచాలకులు డాక్టర్ యోగి, స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు, పశుగణాభివృద్ధి సంస్థ వైద్యాధికారి రాధాకుమారి, కొరసవాడ పశువైద్యాధికారి పి.అనిల్ పాల్గొన్నారు.

పలాస : పలాస పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. జంతు వ్యాధుల నిర్ధారణ ల్యాబ్‌ను పరిశీలించారు. మామిడిపల్లిలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్, పశువైద్యాధికారులు యోగేశ్వరరావు, కె.మధుబాబు ఉన్నారు.

గిరిజన గ్రామాలను అంధకారం చేయొద్దు

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి

ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గిరిజన గ్రామాల్లో థర్మల్ విద్యుత్కేంద్రాన్ని నెలకొల్పాలన్న ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దుల్లో వెన్నెలవలస, లక్ష్మీపురం, శ్రీరామంవలస, మదనాపురం, బొడ్లపాడు, అడ్డూరిపేట, జె.వి.పురం, సోమదలవలస, గోపీదేవిపేట ఆదివాసీ గ్రామాలను ఆనుకుని 3,200 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు విరమించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తే గిరిజన, ఆదివాసీ తెగల జీవనం దెబ్బతింటుందన్నారు. బొగ్గు ఆధారతి ప్లాంట్ వల్ల ఈ ప్రాంతం దుమ్ము, ధూళితో నిండి శ్వాసకోశ వ్యాధులు, ఇతర ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయని అన్నారు. ఈ ప్రాంతంలో వెన్నెలవలస నవోదయ స్కూల్, గిరిజన ఆశ్రమ పాఠశాల ఉన్నాయి. వంశధార, నాగావళి నదుల నీటిని వ్యవసాయానికి కాకుండా ఈ పవర్ ప్లాంట్ అవసరాలకు ఉపయోగించుకునేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. పవర్ ప్లాంట్ వల్ల ఆదివాసులు సాగుచేస్తున్న పోడు వ్యవసాయం నాశనమవుతుందన్నారు. ఈ ప్రతిపాదనను విరమించాలని, లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధి చెందాలంటే రైతుల కోసం సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు గురాడి అప్పన్న, జెసిసి కార్యదర్శి బిడ్డకు ఉమామహేశ్వరరావు, సవర శోభన్, సవర సింహాచలం, సురేష్‌దొర పాల్గొన్నారు.

బాలికలపై లింగ వివక్ష తగదు

ఎమ్మెల్యే గొండు శంకర్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా లింగ వివక్షతకు దూరం కావాలని, బాలికల లింగ నిష్పత్తి పెరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో బేటీ బచావ్, బేటీ పడావ్ ఛాంపియన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారధీ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎదురవుతున్న కష్టాలు, లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలికల నిష్పత్తి తగ్గడానికి భ్రూణ హత్యలు కారణమవుతున్నాయరని అన్నారు. వీటిని నియంత్రించడానికి ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా ప్రజల్లో ఆడపిల్లలపై చిన్న చూపు కొనసాడం ఆందోళన కరమన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పిల్లల లింగ నిష్పత్తిని మెరుగు పరచాలని, లింగ సమానత్వం, మహిళా సాధికారతను సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. ఆడ పిల్లల్లో వివక్షతతో పాటు నిరక్ష్యరాస్యత అధికంగా ఉండేదని, కానీ ప్రస్తుతం అన్ని రంగాల్లో బాలికలు పోటీపడి ఉన్నత స్థానాలు దక్కించుకుంటున్నారని అన్నారు. స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధిశాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించండి, ఆడపిల్లలను చదివించండి అన్న నినాదంతో ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికి పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతి అందజేస్తామని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలమురళి మాట్లాడుతూ గర్భిణులు లింగ నిర్ధారణ పరీక్షలను అడ్డుకోవాలన్నారు. మహిళలే తనకు పుట్టబోయే బిడ్డ ఆడదని తెలిస్తే భ్రూణ హత్యలకు సిద్ధపడుతున్నారని, ఇటువంటి వివక్షత తగదని అన్నారు. కార్యక్రమంలో డిఇఒ తిరుమల చైతన్య, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి ఎస్.శశిభూషణ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకటరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, సభ్యులు ఎం.గన్నప్పడు, అన్నపూర్ణ పాల్గొన్నారు. అనంతరం ఆడబిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు గర్ల్‌చైల్డ్ ఇన్సెంటివ్స్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. వెయిట్ లిఫ్టింగ్, బాల్ బ్యాడ్మింటన్, జూడో, బాక్సింగ్, తదితరమైన క్రీడల్లో విజేతలుగా నిలిచిన పది మంది బాలికలకు రూ.2,500 ప్రోత్సాహకం, మెమెంటో అందజేశారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న విజయకుమార్

కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కుంభమేళాకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు బస్‌స్టేషన్ ఆవరణలో కుంభమేళాకి సంబంధించిన పోస్టర్లను, బేనర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ వద్ద నిర్వహిస్తున్న కుంభమేళాకు ఫిబ్రవరి 8న రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక బస్ బయలుదేరుతుందని తెలిపారు. మార్గంమధ్యలో పూరిలోని జగన్నాథస్వామి ఆలయం, కోణార్కులోని సూర్య దేవాలయం, భువనేశ్వర్‌లోని లింగరాజ ఆలయం సందర్శించుకుని ప్రయాగ్‌రాజ్ చేరుకుంటారని తెలిపారు. అక్కడ స్నానం ఆచరించిన తర్వాత, తిరుగు ప్రయాణంలో కాశి, గయ, బుద్ధ గయ సందర్శన ఉంటుందని అన్నారు. తిరిగి శుక్రవారం శ్రీకాకుళం చేరుకుంటారన్నారు. ప్రయాణికులకు రవాణా సౌకర్యంతో పాటు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఏడు రోజుల్లో ఏడు క్షేత్రాల సందర్శనకు భోజన సౌకర్యంతో కలిపి రూ.9,500 టిక్కెట్ ధర నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపో మేనేజర్లు, హెచ్.అమర సింహుడు, రవి శంకర్ శర్మ, డెప్యూటీ మేనేజర్లు రమేష్, గంగరాజు, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు. టిక్కెట్లు www.apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ టిక్కెట్లు గాని, నేరుగా శ్రీకాకుళం బస్‌స్టేషన్‌లో పొందవచ్చున్నారు. ఇతర వివరాలకు 99592 25608, 99592 25609, 7095040608, 7382917289 నంబర్లను సంప్రదించాలన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

విజయగౌరికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉద్యోగ సంఘ సీనియర్ నాయకులు కేశవరపు శ్రీనివాసు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌ను కలిసి ఓట్లను అభ్యర్థించారు. నిజాయితీ, నిరాడంబరత ప్రజాపోరాటాల్లో అనుభవం ఉన్న విజయగౌరిని గెలిపించాలన్నారు. పిడిఎఫ్ తరపున ఎన్నికైన మండలి సభ్యులు ఉద్యోగులకు మండలిలో తమ వాణిని బలంగా వినిపిస్తున్నారని అన్నారు. వారితో పాటు ఉత్తరాంధ్ర ప్రజల గొంతుకైన మాట్లాడేందుకు విజయగౌరిని పిడిఎఫ్ ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను చట్టసభలో ప్రశ్నించి ఎదురొడ్డి పోరాడుతారన్నారు. అసెంబ్లీలో ప్రజా ఉద్యమాల తరపున ప్రతినిధులు లేక పోవడంతో మండలిలోనైనా ప్రజా గొంతుకై మాట్లాడేందుకు ప్రజా సంఘాల నాయకులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలు ప్రస్తావనకు వస్తాయని, తద్వారా మేలు చేకూరుతుందన్నారు.

రాష్ట్ర ఖజానా ఖాళీ

ప్రజాశక్తి- కవిటి

మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని, గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయలు, ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి జగన్ ప్రభుత్వ పెట్టిన బకాయిలను కూటమి ప్రభుత్వం రూ.22 వేల కోట్లను చెల్లించిందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ లేని విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు పెట్టిందని అన్నారు. మరోవైపు తెచ్చిన అప్పులు విలాసాలు, ఖర్చులకు తగలేశారని ఆరోపించారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతుల్లో ఆశ్రిత పక్షపాతం వహించి కోట్లు కొల్ల గొట్టినట్టు ఆరోపించారు. జగన్ అనాలోచిత నిర్ణయాలు, అశ్రిత పక్షపాతంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందన్నారు. ప్రస్తుత ప్రభు త్వానికి గుదిబండగా మారడంతో పాటు ప్రజల పాలిట శాపమైందని అన్నారు.

పలాస : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ, ధాన్యం కొనుగోలు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండిపోయాయని అన్నారు. విద్య, వైద్య, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఇరిగేషన్, ఉపాధి హామీతో పాటు పిల్లలకు సరఫరా చేసే చిక్కీలు, గుడ్లు సరఫరాతో కలిపి రూ.1.40 లక్షల కోట్లు బకాయి పెట్టారని అన్నారు. ఇంత భారీ మొత్తంలో అప్పులు గతంలో ఏ ప్రభుత్వాలు పెట్టలేదన్నారు.

మాట్లాడుతున్న అప్పన్న

గిరిజన భూముల ఆక్రమణ తగదు

కొత్తూరు: పర్యాటకం పేరుతో గిరిజన భూముల ఆక్రమణ తగదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న అన్నారు. మండలంలోని మెట్టూరుగూడలో ఆదివాసీ గ్రామ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలపై ఏ మాత్రం చర్చలేకుండా, వారి సమస్యలపై కనీసం మాట్లాడకుండా గిరిజన భూము లను, వారి కొండలను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి ప్రభుత్వం సిద్ధం కావడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. జిల్లాలో గిరిజన సమస్యలు పరిష్కారానికి ఐటిడిఎ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సమస్యలైన తాగునీరు, రోడ్లు, వైద్య సదుపాకాలు కల్పించాలన్నారు. గిరిజన భూములను లాక్కోనే ప్రయత్నం ఆపాలని, లేకుంటే మరో గిరిజన రైతాంగ పోరుకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో సవర జగదీష్, సవర దీపావళి, సవర దశరత, సవర యతిరాజు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

రోడ్లపై పార్కింగ్ చేయరాదు

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపి వేస్తున్నారని, ఇక వాహనాలు నిలుపుదల చేస్తే చర్యలు తప్పవని కాశీబుగ్గ డిఎస్‌పి కె.వెంకట అప్పారావు వాహనచోదకులకు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ కేటి రోడ్డుపై నిలిపిన వాహనాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయడం ద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. వీటివల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తుగా రోడ్లపై వాహనాలను నిలుపుదల చేస్తే అపరాధ రుసుం వసూతు చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పైపైనే రోడ్ల మరమ్మతులు

- ప్రజలకు తప్పని అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు

మామిడివలస గ్రామ సమీపంలోని రహదారి దుస్థితి

వావాం వెళ్లే ప్రధాన రహదారి

తూతూ మంత్రంగా రహదారుల మరమ్మతులు చేపట్టడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తు న్నారని బహిరంగంగానే స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజాశక్తి- బూర్జ

గ్రామీణ రహదారులకు ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో రహదా రులన్నీ గోతులమయంగా మారడంతో ఎట్టకేలకు ప్రభుత్వం రహదారుల మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేసింది. మండలంలోని ఐదు గ్రామీణ రహదారుల మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేసింది. ఇందులో మరిడమ్మ తల్లి ఆలయం నుంచి అల్లెన వరకు మూడున్నర కిలోమీటర్ల రహదారి కోసం అలాగే బూర్జ నుంచి పెదలంకాం గ్రామానికి ఏడున్నర కిలోమీటర్ల రహదారి మరమ్మతుల కోసం, అలాగే నీలాదేవపురం నుంచి మామిడి వలస గ్రామం వరకు పి.ఎల్ దేవి పేట సిఎస్‌పి రోడ్డు నుంచి సరుబుజ్జిలి రోడ్డు వరకు, కొల్లివలస సిఎస్‌పి రోడ్డు నుంచి నారాయణపురం ఆనకట్ట వరకు రహదారుల మరమ్మతుల కోసం రూ.24 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే గుత్తేదారు ఈ రహదారుల మరమ్మతులను కేవలం తూతూ మంత్రంగానే జరిపారని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఏ రహదారి చూసిన ఏమున్నది గర్వకారణం అంతా గోతులమయం అనే చందంగా తయార య్యాయని వాపోతున్నారు. కేవలం చిన్నచిన్న గోతులను మాత్రమే కప్పి చేతులు దులుపు కున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రహదారుల మరమ్మతుల సమయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షణ జరిపి నాణ్యత ప్రమాణాలు కలిగిన రహదారులకు మరమ్మతులను జరిపించాలని తద్వారా తమ రహదారి కష్టాలను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



నీలంపేట రహదారి

స్పందించని అధికారులు

రహదారుల మరమ్మతుల్లో నాణ్యత కరువైందన్న విషయంపై అధికారుల వివరణ కోసం ప్రజాశక్తి రోడ్లు భవనాల శాఖ జెఇ ఆంజనేయ నాయక్, డిఇఇ గణపతి రావులను ఫోన్‌లో పలుమార్లు ప్రయత్నించినప్పటికీ వారు స్పందించకపోవడం గమనార్హం.

నాణ్యత కరువు

ఎట్టకేలకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి నప్పటికీ నాణ్యత కరువైంది. ఎక్కడ గోతులు అక్కడే కనిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో రహదారికి మరమ్మతులు జరిపించేందుకు చర్యలు తీసుకోవాలి.

– బి.అప్పన్న, ఉవ్వపేట

పర్యవేక్షణ లేదు

రహదారి మరమ్మతులకు పనులు ప్రారంభించినప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో పనులు అంతంతగానే ఉన్నాయి. అధికారులు పర్యవేక్షణ జరిపి రహదారికి నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలి.

– ఎస్.శ్రీనివాసరావు, మామిడివలస

రాళ్లు తేలుతున్నాయి

ఎట్టకేలకు తమ గ్రామ రహదారికి మరమ్మతులు చేపట్టి నప్పటికీ అన్నిచోట్ల రాళ్లు తేలుతున్నాయి. రహదారిపై రాళ్లు తేలడంతో వాహనదారులకు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.

– మంగు మధు, నీలంపేట

జాడ లేని అధికారులు

రహదారి మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ అంతా గోతుల మయంగానే తయార య్యాయి. పర్య వేక్షించాల్సిన అధికారుల జాడ లేదు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టి రహదారి కష్టాలను తీర్చాలి.

– ఎడ్ల రామకృష్ణ, అల్లెన

అల్లెన - అంపిలి గ్రామాల మధ్య రహదారి

చొరవ చూపాలి

అను నిత్యం రహదారి బాగోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నాం. మరమ్మతులు చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమా ణాలు పాటించే విధంగా అధికారులు చొరవ చూపాలి.

– మజ్జి లక్ష్మీనారాయణ, పి.ఎల్ దేవిపేట

కొనసాగుతున్న డ్రోన్ నిఘా

శ్రీకాకుళం: శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నగరం శివారు ప్రాంతంలో డ్రోన్ నిఘా కొనసాగుతుంది. చట్ట వ్యతిరేక కార్యాలకాలకు అడ్డుకట్టు వేసేందుకు .ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం అరసవల్లి, కొత్తపేట 80 ఫీట్ రోడ్డు, దమ్మలవీధి, వాంబే కోలని, డచ్ బంగ్లా, పొన్నాడ వంతెనల నదీ పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో ప్రత్యేకంగా పెట్టారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న నగరం శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా కొన సాగుతుంది. బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి వినియోగించిన పేకాట, ఈవ్‌టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారు పట్టు బడినట్లయితే చట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు.

జిల్లా ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం

శిశువుతో బాలింత

టెక్కలి రూరల్: టెక్కలిలో జిల్లా ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బయట పడింది. ఈ నెల 24న సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడుకు చెందిన టి.కల్పన అనే గర్భిణి ఆస్పత్రిలో ప్రసవించింది. పుట్టిన మగ శిశువుకు ఆ రోజు మధ్యాహ్నం వ్యాక్సిన్ వేశారు. ఈ క్రమంలో ఇంజిక్షన్ సూది శిశువు తొడ భాగంలో ఉండిపోయింది. దీన్ని కుటుంబ సభ్యులు మంగళవారం గుర్తించారు. బుధవారం ఆస్పత్రికి వచ్చి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది స్పందించలేదు. సూపరిం టెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ విచారణలో సిబ్బంది నిర్లక్ష్యం తేట తెల్లమైంది. ఈ విషయం జిల్లా అధికారులు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి రూరల్: ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా 10 శాతం మద్యం దుకాణాల్లో కల్లుగీత తరగతికి కేటాయించారని, వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సిఐ ఎస్.కె.మీరసాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని టెక్కలి మండలానికి సంబంధించి సెగిడిలకు ఒకటి, నందిగాం మండలంలో శ్రీశయనలకు ఒక మద్యం దుకాణాలు కేటాయించారని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తరగతి ధ్రువపత్రం, రూ.2 లక్షలు డిడి తీసి వచ్చే నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివ రాలకు 9492543354 నంబరును సంప్ర దించాలన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

మందస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మహిళా సమైక్య కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తు న్నారని జనసేన కార్యదర్శి కార్యదర్శి సంతోష పండ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

మందస : మందస మండల పరిధిలోని శుక్రవారం 132 కెవి పలాస సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణ పనులు చేపడు తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వం రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు.

11 నుంచి 'పది' ప్రజ్ఞా వికాస్ పరీక్షలు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పవిత్ర

శ్రీకాకుళం అర్బన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన ప్రజ్ఞా వికాస్ పరీక్ష ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పి.పవిత్ర తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ప్రజ్ఞా వికాస్ పరీక్షల పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఆయా మండలాల్లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షకు ప్రవేశ రుసుం రూ.30 చెల్లించి పరీక్షకు హాజరు కావచ్చున్నారు. పదో తరగతి సిలబస్ ఆధారంగానే ఈ పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. గణితం, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ 20 మార్కుల వంతున, ఎన్ఎస్, ఫిజికల్ సైన్స్ 10 మార్కుల వంతున పేపరు ఉంటుందని అన్నారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు 10 మార్కుల వంతున ఉంటుందన్నారు. వంద మార్కులకు పేపరు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాటాలకే పరిమితం కాదని, పరీక్షల్లో, చదువుల్లో విద్యార్థులను నిరంతరం మేల్కొపి ఉన్నతస్థాయికి తీసుకెళ్లే బాధ్యతలను తీసుకుంటున్నామని అన్నారు. పరీక్షకు హాజరు కావాల్సిన విద్యార్థులు అందులో ఎలా నెగ్గాలో తెలుసుకోవచ్చున్నారు. అలాగే పరీక్ష రాయడానికి అవసరమైన మేరకు చదువు కున్నామని ధీమా పడిన విద్యార్థులకు తట్టి లేపేందుకు ఈ పరీక్ష దోమదపడుతుందన్నారు. విద్యార్థుల్లో అవగాహన, ఆసక్తి పెంచడానికి ప్రజ్ఞా వికాస్ పరీక్ష దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చందు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇటుకల బట్టీల తనిఖీ

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం: ఇటుక బట్టి పనుల్లో బాల కార్మికులను పెట్టరాదని ఎంఇఒ అప్పారావు, సమగ్ర శిక్షా అభియాన్ అధికారి పి.జనార్ధనరావు, లేబర్ ఆఫీషర్ ఎం.విజయకుమార్ ఆదేశించారు. మండలంలోని హరిపురం, మసాకపురం, బిర్లంగితోటూరు గ్రామాల్లో చేపడుతున్న ఇటుకల బట్టీలను బుధవారం టార్స్‌ఫోర్స్‌తో కలిసి తనిఖీ చేశారు. ఇక్కడకు వలస వచ్చిన వారి పిల్లలను గుర్తించారు. ఇటుక బట్టి యాజమాన్యాలతో మాట్లాడి అన్ని సెంటర్ల వద్ద చదువు చెప్పేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వివరాలు సేకరించి ఎన్ఆర్ఎస్‌టిసి సెంటర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టారు. కార్యక్రమంలో బ్రెడ్స్ కో-ఆర్డినేటర్ ఎం.స్వాతి, సిఆర్ఎంటిలు ఆర్.తులసీరావు, సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యతని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజని అన్నారు. వర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-7 ఆధ్వర్యంలో 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ' కార్యక్రమం బుధవారం క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విసి రజని మాట్లాడుతూ ప్రభుత్వాలు, పోలీస్ యంత్రాంగంతో పాటు ప్రజల చైతన్యవంతమైన భాగస్వామ్యం ఉంటేనే రోడ్డు ప్రమాదాల శాతాన్ని తగ్గించ వచ్చునన్నారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదని యువతకు సూచించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వంటివి ధరించి వాహనాలను నడపితే ప్రమాదాలకు అధికంగా అడ్డుకట్టు వేయవచ్చునన్నారు. ఎన్ఎస్ఎస్ వర్శిటీ కో-ఆర్డినేటర్ డా. డి.వనజ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్ రాజశేఖరరావు, యూనిట్-7 పిఒ టి.భవాని మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి 31 వరకు రోడ్డు భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై వక్తృత్వపు పోటీ నిర్వహించారు. పియుసి, ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు. రోడ్డు భద్రత, సేఫ్టీ డ్రైవింగ్ రూల్స్ పాటించడం వలన రోడ్డు ప్రమాదాలను నివారిస్తూ ఎంతోమంది జీవితాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ డా పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.వి.సింహాచలం, డా.జి.ఈశ్వరరావు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ సందీప్‌కుమార్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పలాస : పలాస జాతీయ రహదారి కోసంగిపురం సమీపంలో ఉన్న గెడ్డలో గుర్తు తెలియని మృతదేహం (40) బుధవారం లభ్యమైనట్లు కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ తెలిపారు. వారం క్రితం మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నామని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

పలాస : మండలంలోని లొద్దభద్ర వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మెళియాపుట్టి మండలం గొప్పిలికి చెందిన బాలరాజు, నందిగాం మండలం దీనబంద్‌కు చెందిన ధర్మారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురు ద్విచక్ర వాహనంపై గొప్పిలి నుంచి కాశీబుగ్గ వస్తుండగా వాహనం అదుపు తప్పడంతో బోల్తా పడ్డాడు. వెంటనే స్థానికులు 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారున లెప్రసీ కాలనీ వద్ద ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ద్విచక్ర వాహనంలో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. సరుబుజ్జిలి మండలం కొండవలసకు చెందిన అల్లాడ రాజు పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించారు. అనంతరం తన ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు ఒక్కసారిగా భయందోళనలు చెందారు. వెంటనే పెట్రోల్ బంక్ సిబ్బంది అప్రమత్తమై బండిని పెట్రోల్ బంక్ బయటకు తీసుకువచ్చారు. ద్విచక్ర వాహనదారుడు రాజు పెట్రోల్ బంక్ ఆవరణలో ఉన్న మంచినీటిని బకెట్లతో తీసుకువచ్చి ద్విచక్ర వాహనం మంటలు ఆర్పడానికి ప్రయత్నించాడు. వెంటనే సిబ్బంది బంకు వద్ద ఉన్న మంటలను ఆర్పే గ్యాస్‌ను తీసుకువచ్చి ద్విచక్ర వాహనంపై స్ప్రే చేసి మంటలను ఆపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

దగ్ధమైన షాపు

షాపు దగ్ధం

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కార్పెంటర్ షాపు దగ్ధమైంది. రాయల మోహనరావుకు చెందిన ఈ షాపులో విలువైన ఫర్నిచర్ పరికరాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.50 వేలు విలువైన ఆస్తి నష్టం సంభవించిందని, నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఆయన నేత్రాలు పదిలం

రమణమూర్తి (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వర్తకునిగా పేరున్న జామి రమణమూర్తి (62) బుధవారం ఉదయం ఆకస్మాత్తుగా మృతి చెందారు. పాజుల్‌బాగ్ పేటలో నివాసముంటున్న ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ కేంద్రానికి దానం చేశారు. భార్య: కామేశ్వరి, కుమారుడు నవీన్, కోడలు గౌతమిల సమక్షంలో కార్నియాలను సేకరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లీలారాణి

చిన్నారుల ఆధార్‌ను నమోదు చేయాలి

పొందూరు: అంగన్వాడీ కేంద్రాల్లో గల చిన్నారుల ఆధార్ నెంబర్లను బాల సంజీవిని యాప్‌లో నమోదు చేయాలని సూపర్‌వైజర్ కె.లీలారాణి పేర్కొన్నారు. మండలంలోని లోలుగులో బుధవారం అంగన్వాడీల సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. బరువు తక్కువుగా ఉన్న చిన్నారులను శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలన్నారు. అలాగే రికార్డుల నిర్వాహణను సక్రమంగా చేపట్టాలని సూచించారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి

లావేరు: మండలం తామాడలో వీధి కుక్కల దాడిలో ఆరు మేకపిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాసి రాము మేకల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి పక్కన కంచె వేసి మేక పిల్లలను పెంచుతున్నారు. బుధవారం తెల్లవారు జామున కుక్కలు తొమ్మిది మేకపిల్లలపై దాడి చేశాయి. వీటిలో ఆరు మేక పిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, మేక పిల్లల మృతితో తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాము కోరుతున్నారు.

ఉపాధ్యాయ వృత్తి సంతృప్తినిచ్చింది

అంబటి కృష్ణమూర్తి

ప్రజాశక్తి- సోంపేట

ఉపాధ్యాయునిగా తన అనుభవించిన సుదీర్ఘ జీవితం ఎంతో సంతృప్తికరమని మందస మండలం బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంబటి కృష్ణమూర్తి అన్నారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న ఆయనకు తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లో... సోంపేట మండలం మత్స్యకార గ్రామీమైన ఎర్రముక్కంలో 1963 అక్టోబరు 18న అంబటి కేశవరావు, రేఖమ్మలకు మొదటి సంతానంగా జన్మించారు. ఆయనకు ముగ్గురు తమ్ముళ్లు, ఒక సహోదరి ఉన్నారు. గ్రామంలోని సమితి ప్రైమరీ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. బారువ జిల్లా పరిషత్ పాఠశాలలో 8 నుంచి పదో తరగతి వరకు చదివారు. 1979 నుంచి సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో బిఎస్‌సి చదివారు. తర్వాత 1986లో గుంటూరు డైట్ కళాశాలలో టిటిసిని పూర్తిచేశారు అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో బిఇడి, చెన్నయ్ యూనివర్సిటీలో ఎంఎస్‌సిని చదివారు. 1989లో జూన్ 13న ఎస్‌జిటిగా తొలిసారి కంచిలి మండలం పోలేరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. 2001లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి రావడం టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేశారు. 2011 వరకు అక్కడే పనిచేశారు. ఆ కాలంలోనే ఎన్‌సిసి ఆఫీసర్‌గా సేవలందించారు.

కృష్ణమూర్తి, గీతాంజలి దంపతులు

అక్కడి నుంచి 2011 నుంచి 2019 వరకు పొందూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2017లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి కలెక్టర్ లక్ష్మీనరసింహ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం మందస మండలం వాహనపల్లి ఉన్నత పాఠశాలలో క్రియేట్-2 హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

1990లో వివాహం

కృష్ణమూర్తికి 1990 మే 6న రట్టి వల్లభరావు సావిత్రముల ప్రథమపుత్రిక తాంజలితో వివాహమైంది. వీరికి అంబటి విద్యాసాగర్, సుధ ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు విద్యాసాగర్ ప్రస్తుతం మెరైన్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారు. కోడలు నవీన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె సుధ ఇండియన్ ఎయిర్ ఫోర్సులో ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది. వీరి శిష్యులుగా ఉన్న చాలామంది ప్రస్తుతం వైద్యులుగా, స్టాఫ్‌వేర్ ఇంజినీర్లుగా ఉన్నారు.

వేధింపులకు గురవుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఐసిడిఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ లీలారాణి లీలలు దూకుడుతో అంగన్వాడీ సిబ్బంది హడలెత్తి పోతున్నారు. గత కొంతకాలంగా ఆమె వ్యవహరిస్తున్న తీరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు అంగన్వాడీలు వాపోతున్నారు. అరకొర జీతాలతో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టికొస్తున్న తమను వేధిస్తూ ఇబ్బందుల పాల్జేస్తుందని పలువురు ఆమె వ్యవహరిస్తున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమపై అధికార ప్రతాపం చూపుతూ అడుగడుగునా తమను ఇబ్బందుల పాలు చేస్తుందని పలు కేంద్రాల అంగన్వాడీలు బయటకు తమ బాధను చెప్పుకోలేక లోలోన మదనపడుతున్నారు.

మామూళ్లు ఇవ్వకుంటే తిట్ల పురాణం

కూరగాయలు, ఇంటి అద్దె తమకు అందే జీతాల్లో కూడా మామూళ్లు ఇవ్వాలని ప్రతి నెల వేధిస్తూ ఫోన్‌లో తిట్ల పురాణాన్ని ఎత్తుకుంటుందని, ఎదురు చెబితే లేనిపోని ఇబ్బందులు కలుగజేసి తమను ఇక్కట్లకు గురి చేస్తుందని అంగన్వాడీ సిబ్బంది వాపోతున్నారు. గతంలో కూడా పురపాలక సంఘంలోని 7వ వార్డు చింతాడలో ఓ అంగన్వాడీ టీచర్‌పై సచివాలయ మహిళా పోలీసును నిఘా పెట్టి మామూళ్ల కోసం వెంటాడి వేధించిందని పలువురు అంగన్వాడీలు గుర్తు చేస్తున్నారు. అలాగే అదే కేంద్రంలో లబ్ధిదారులు పాలను తీసుకు వెళ్లక పోవడంతో కేంద్రం లోనే పాలు ఉండిపోతే ఎందుకు లబ్ధిదారులు తీసుకు వెళ్లలేదని నీ జీతం నుంచి పాల డబ్బులను రికవరీ చేస్తానని హెచ్చరించిందని అంగన్వాడీ కేంద్రం చుట్టుపక్కల ప్రజలు చెబుతున్నారు. లబ్ధిదారులకు పలుమార్లు పాలను తీసుకువెళ్లాలని సమాచారం అందించామని వారు పనులపై బయటికి వెళ్లామని తరువాత వచ్చి తీసుకు వెళ్తామని సమాచారం ఇచ్చారని కేంద్రంలోనే పాలను భద్రపరిచామని పరిశీలనకు వచ్చిన సూపర్‌వైజర్ పాలను చూసి అంగన్వాడీ సిబ్బందిపై విరుచుకు పడుతుందని పలువురు చెబుతున్నారు. మంగళవారం గేటు, మెట్టక్కివలస తదితర ప్రాంతాల అంగన్వాడీ కేంద్రాల అద్దెలను అంగన్వాడీల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటి యజమానుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఆ ప్రాంతాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్న అంగన్వాడీలు రెండు నెలల క్రితమే వారు ఉండే అంగన్వాడీ కేంద్రాల అద్దె ఇళ్లను ఖాళీ చేసి వేరేచోటకు అద్దెకు మారడంతో చిక్కుముడి ఏర్పడింది. పాత ఇంటి యజమానుల దగ్గరకు వెళ్లి ఆ అద్దె డబ్బులు తీసుకుని కార్యాలయానికి రావాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని పలువురు అంగన్వాడీలు వాపోతున్నారు. నిత్యం ఆమె తమతో దురుసుగా ప్రవర్తిస్తూ మామూళ్ల కోసం వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ మానసికంగా వేధిస్తుందని అంగన్వాడీలు వాపోతున్నారు. ప్రభుత్వం ఇంటి అద్దె, కూరగాయలు అంగన్వాడీల జీతాలు జమ చేసిన ప్రతిసారి ఆమెకు మామూళ్లు చెల్లించినప్పటికీ ఆమె తమపై ప్రతాపం చూపించడం మానడం లేదని ముందు ముందు మరెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తొందరలోనే జిల్లా ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేకు ఆమె వ్యవహార శైలిపై ఫిర్యాదు చేయాలని అంగన్వాడీలు భావిస్తున్నట్లు సమాచారం. తమకు ఇతర అధికారులు, సిబ్బంది నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని పలువురు అంగన్వాడీలు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా సంబంధిత అధికారులు ఆమెపై దృష్టిసారించి సమస్యల సుడిగుండం నుంచి తప్పించాలని పలువురు అంగన్వాడీలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ (ఫైల్)

మనోహర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంత్రి మనోహర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పోలాకి : విజయవాడ వెలగపూడి సచివాలయంలో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిగా వ్యవసాయ ఆధారిత నియోజకవర్గమైన నరసన్నపేటలో ధాన్యం కొనుగోలు పరిమితి పూర్తయిందన్నారు. ఇంకా 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సిన ఉందని, మిగతా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

క్లస్టర్ పాఠశాలలపై అవగాహన

కవిటి: క్లస్టర్ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు కోసం కవిటిలో బుధవారం అన్ని క్లస్టర్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి మాట్లాడుతూ మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి పూర్తి రూట్ మ్యాప్ రూపొందించినట్లు తెలిపారు. దీని కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్తి సహాయ సహకారాలు అందించి మోడల్ ప్రైమరీ పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటులో సహకరించాలని కోరారు.

పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

జగనన్న కాలనీ పరిశీలన

ఇచ్ఛాపురం: పట్టణంలో వైసిపి ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి కోరారు. జగనన్న కాలనీ నిర్మాణం, ప్రస్తుత పరిస్థితి, కాలనీ వాసుల ఇబ్బందులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణానికి సమీపంలో పాతశ్మశానం ఆనుకొని సమీపంలో 700 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు గత ప్రభుత్వంలో ఉచితంగా ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు రూ.1900 నుంచి రూ.3 వేలు వరకు తీసుకుంటున్నారని అన్నారు. గతంలో ఉచితంగా అమర్చిన మీటర్లకు కూడా ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. కాలనీ వాసులకు తాగునీరు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. కాలనీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు.

20 వేల దరఖాస్తులు పెండింగ్

పలాస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపార్ ఐడి కోసం విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు, ఒప్పులను సరిచేసుకునేందుకు పలాస డివిజన్ పరిధిలో ఎల్‌ఆర్‌బిడి 20 వేలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్‌డిఒ జి.వెంకటేష్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో కలిసి ఎల్‌ఆర్‌బిడి దరఖాస్తులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 20 వేలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఒక్క రోజే 4 వేలు దరఖాస్తులను పరిశీలించిందన్నారు. అపార్ ఐడి కారణంగానే అధిక సంఖ్యలో ఎల్‌ఆర్‌బిడి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ సెంటర్లు పునరుద్ధరించాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతుల సెంటర్ పునరుద్ధరించాలని టిడిపి బిసి సాధికారత సమితి కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సెంటర్ గత వైసిపి పాలనలో తొలగించిందని అన్నారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, మందస, ఒడిశా రాష్ట్రం నుంచి విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు.

డ్రెయినేజీలు నిర్మిస్తాం

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ముస్లిం వీధిలో డ్రెయినేజ్ లేకపోవడంతో మురుగు నీరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోరు వద్దకు చేరి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా బుధవారం పాఠశాలను, ముస్లిం వీధిలో సందర్శించారు. ముస్లిం వీధి నుంచి వచ్చే మురుగునీరు ఓ ప్రయివేట్ వ్యక్తి స్థలంలోకి మళ్లించి పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేశారు. రెండు నెలల్లో ముస్లిం వీధికి డ్రెయినేజీలు నిర్మిస్తామని అన్నారు. ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వర, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అసపాన రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చింతల అప్పారావు, వీఆర్‌ఒ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య నిర్వహణ

కవిటి: పక్కాగా పారిశుధ్యం నిర్వహించాలని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. మండలంలోని కపాసుకుద్దిలో రూ.7 లక్షల నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉన్నప్పుడే పరిసరాలు బాగుంటాయని అన్నారు. పల్లెలు పచ్చగా ఉంటాయన్నారు. వ్యాధులు వ్యాపించకుండా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్ కె.దమయంతి, మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు, ఎంపిటిసి టి.పార్వతి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ

వజ్రపుకొత్తూరు : వ్యాక్సిన్ వేస్తున్న సత్యప్రకాష్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పశువుల ఆరోగ్య పరిరక్షణలో రైతులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం డిడి డాక్టర్ సత్యప్రకాష్ అన్నారు. మండలంలోని పెద్దబొడ్డపాడులో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంతో పోలిస్తే పాల దిగుబడి గణనీయంగా పెరిగిందన్నారు. మేలైన పశు జాతులను ఎంచుకోవడం ద్వారా ఇది సాధ్యమైందని వివరించారు. కృత్రిమ గర్భధారణ వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. వ్యవసాయంలో దుక్కి పశువుల అవసరం తగ్గిందని అన్నారు. ప్రస్తుతం పాడి పశువుల పోషణకు రైతులు ముందుకు వస్తున్నారని అన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా లింగ నిర్ధారణలో పాడి పశువులు అభివృద్ధి దిశగా ఇంజిక్షన్లు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ విధానంలో 90 శాతం వరకు పాడి పశువుల ఉత్పత్తి అవుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఎడి మట్ట రవికృష్ణ, పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు దుంపల వల్లభరావు, ఉప సర్పంచ్ దుంపల గోవిందరావు, వెటర్నరీ సహాయక అధికారి గుంటర దేవేంద్ర పాల్గొన్నారు.

మందస : మండలంలోని రాంపురం, బుడతపల్లి గ్రామాల్లో హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి కిల్లి ఉమాభారతిలు పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయడం, దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో జుట్టు అమ్మినాయుడు, లక్ష్మన ఉమాపతి, దున్న రామారావు, కొడ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పొందూరు: మండలం కోటిపల్లిలో పశు వైద్యాధికారి పి.పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పశువులకు, లేగ దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. అలాగే కోళ్లకు, గొర్రెలు, మేకలకు మందులు వేశారు. గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, పాడిరైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మందులను అందజేస్తున్న వైద్యసిబ్బంది

పొందూరు : పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, పాడిరైతులు

ఆమదాలవలస : మండలంలోని గాజులకొల్లివలస, హనుమంతుపురం గ్రామాల్లో పశు వైద్య శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ చికిత్సలు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేపట్టారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు, పశు వైద్యులు డాక్టర్ హేమలత, ఓంకార్, లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ నవ్య, శ్రావణి, పశువైద్య సిబ్బంది శ్రీవాణి, సూర్యారావు, గోపాలమిత్రలు నవీన్‌కుమార్, నారాయణరావు, ప్రవీణ్‌కుమార్, సూర్య మోహన్ పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్లతో మహిళలకు భరోసా

శ్రీకాకుళం అర్బన్: పరువు, పేదరికం, నిరక్షరాస్యత వంటి కారణాలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మహిళలకు వన్ స్టాప్ సెంటర్లు భరోసానిస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో ఉన్న వన్ స్టాప్ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ఈ కేంద్రాలతో బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించడంతో పాటు న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఇస్తూ అండగా నిలుస్తున్నాయన్నారు. మహిళలు, చిన్నారులు ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే పోలీసుల సహాయంతో కేసు దర్యాప్తు మొదలు బాధితులకు ఆశ్రయం కల్పించడం జరుగుతోందన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

సరుబుజ్జిలి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న ప్రతి వాలంటీరు పది మంది నిరక్షరాస్య వయోజనులకు అక్షరాస్యులుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గోవిందరాజులు, ఎంఇఒ శ్రీనివాసరావు, ఎఒ ప్రసాదరావు, మహిళా సమైక్య అధ్యక్షురాలు పేడాడ మణి, మండల కో-ఆర్డినేటర్ రమణ బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ ఎంపికల్లో బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్మెంట్ (ఐఎంఎల్) సంస్థ హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించింది. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ (కో-ఎడ్) విద్యార్థులు 51 మంది ఈ ఇంటర్వ్యూల్లో ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎన్.వి వేణుగోపాల్ తెలిపారు. ప్రస్తుతం ఆరవ సెమిస్టరులో ఉండగానే ఐఎల్‌ఎం కంపెనీలో విద్యార్థులు ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.5లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల సెక్రెటరీ డా. సుగుణా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కళాశాల డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి సుబ్రహ్మణ్యం, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్.రాజు, విద్యార్థులను అభినందించారు.

సిఎం సహాయనిధి అందజేత

పాతపట్నం: మండలంలోని తెంబూరుకు చెందిన సందపు దూర్యోధనరావు కుమారుడు దిజ్వనంద్ కుమాడు చెవి వినికిడి సంబంధించిన సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ముఖ్యమంత్రి సహాయా నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు సిఎం సహాయ నిధి ద్వారా రూ.5,33,624 విడుదలైంది. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ఆధారంగా సిఎం సహాయ నిధిని అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైల బాబ్జి, శివాల చిన్నయ్య, కలమట భుజంగరావు పాల్గొన్నారు.

ఎదురుపడిన రాజకీయ ప్రత్యర్థులు

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో బుధవారం నిర్వహించిన ఓ వివాహ వేడుకలో రాజకీయ ప్రత్యర్థులు ఎదురుపడ్డారు. భోజన సమయంలో ఒక్కసారిగా ఒకరు ఒకరు ఎదురు పడ్డారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లు ఎదురుపడి చలోక్తులు వేసుకున్నారు. దీంతో అందరిలోనూ ఉత్కంఠతో ఆసక్తిగా చూశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిట

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎపిలో భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించడంతో రణస్థలం సబ్ రిజిస్టర్ కార్యాలయం బుధవారం కిటకిటలాడింది. రణస్థలం, లావేరు మండలాలకు చెందిన భూముల కొనుగోలు దారులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి అధిక సంఖ్యలో వచ్చారు. గురు, శుక్ర, శనివారాలు ఈరద్దీ ఇంకా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. గ్రోత్ సెంటర్ల ఆధారంగా 0 - నుంచి 20 శాతం ఛార్జీలు పెంచనున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఉన్న 29 గ్రామాలకు ఈ ఛార్జీల పెంపును మినహాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాంతాల్లో భూమి విలువ కంటే రిజిస్ట్రేషన్ విలువలో వ్యత్యాసాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీటిని సరిచేయాలని నిర్ణయించింది. మార్పుల కారణంగా భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రిజిస్ట్రేషన్ బుక్ విలువ పెంచి రిజిస్ట్రేషన్ రేట్లు నిర్ణయించారు. ప్రస్తుతం భూమి కొనుగోలు చేస్తే రూ.లక్ష రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే కొత్త రేట్ల ప్రకారం. ఫిబ్రవరి 1 నుంచి రూ. 1.20 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూమి కొనాలంటే సామాన్యులకు భారంగా మారనుంది.

రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన భూముల కొనుగోలుదారులు

యూనియన్ బ్యాంకు రెనోవేటెడ్ శాఖ ప్రారంభం

ప్రారంభిస్తున్న శాలినీ మీనన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద యూనియన్ బ్యాంకు రెనోవేటెడ్ శాఖను జోనల్ మేనేజర్ శాలిని మీనన్ బుధవారం ప్రారంభించారు. సిఎస్‌ఆర్ యాక్టివిటీలో భాగంగా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం నుంచి రూ.10.5 లక్షల వ్యయంతో బ్లడ్ స్టోరేజీ క్యాబిన్, వోల్టేజీ స్టెబిలైజర్, బ్యాటరీ బ్యాకప్ ఉన్న కలక్షన్ మోనిటర్‌ను ప్రభుత్వ సర్వజనాసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యాలయ రీజనల్ మేనేజర్ ఎం.వెంకట్ తిలక్, బ్యాంకు మేనేజర్ కె.తేజేశ్వరరావులు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు చేపట్టే సిఎస్‌ఆర్ కార్యక్రమాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందంజలో ఉందని వారు తెలిపారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయ పరిధిలో పబ్లిక్ లైబ్రరీ నిర్మాణం కోసం రూ.33 లక్షలు, 10 గ్రామ సచివాలయాల్లో సోలార్ ప్యానల్ కోసం రూ.15 లక్షలు ఖర్చు చేశామన్నారు. యూనియన్ బ్యాంక్ అందించే ప్రీమియం సేవింగ్, కరెంట్ ఖాతాలు ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయ ఆధారిత రుణాలు, వ్యాపార, గృహ, వాహన, వ్యక్తిగత రుణ సదుపాయాలను బ్యాంకు ద్వారా కల్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 43 శాఖల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. అలాగే ఈ ఏడాది మార్చి 31 నాటికి ప్రొసెసింగ్ ఫీజు లేకుండా ఇంటి, కారు రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు.

ఉదారత చాటుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన ఎందువ అప్పలనాయుడు, దమయంతిల ఐదేళ్ల కుమారుడు ఎందువ కీర్తివర్ధన్ బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతున్న విషయం ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితం కావడంతో విషయం తెలుసుకున్న కొండములగాం మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం వెంటనే విద్యార్థులకు పిలుపునివ్వడంతో తక్షణమే స్పందించిన విద్యార్థులు రూ.30 వేలు పోగుచేసి ఆ బాలుని తల్లిదండ్రులకు ఆపరేషన్ నిమిత్తం విద్యార్థులు స్వయంగా బుధవారం అందజేశారు. ఇందుకు సహకరించిన ప్రతి విద్యార్థికి, తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బందికి ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నగదును అందజేస్తున్న విద్యార్థులు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి- పాతపట్నం

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని సిఐ వి.రామారావు సూచించారు. స్థానిక రహదారిపై బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని 30 వాహనాలను సీజ్ చేసి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. అనంతరం స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంకల్పం అనే కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం వల్ల వచ్చే జబ్బుల కోసం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు వంటి వివరించారు.

పాతపట్నం : అవగాహన కల్పిస్తున్న సిఐ రామారావు

మెళియాపుట్టి : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరిని ఎస్‌పి పి.రమేష్‌బాబు అన్నారు. మెళియాపుట్టిలో వాహనాలను తనిఖీ చేశారు.

హౌసింగ్ గ్రీవెన్స్‌కు 8 దరఖాస్తులు

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన హౌసింగ్ గ్రీవెన్స్‌కు 8 దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు తెలిపారు. అర్బన్ లే అవుట్‌ల్లో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు, ఇసుక వంటి సమస్యలపై దరఖాస్తులొచ్చాయి. తక్షణమే పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా హౌసింగ్ సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుల విజయం

ప్రజాశక్తి- కవిటి

తిత్లీ తుపానుకు నష్టపోయిన ఆ రైతు అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిన సాయం పొందలేకపోయాడు. సాంకేతిక కారణాలతో అతనికి అప్పట్లో నగదు జమ కాలేదు. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం రెండో విడత ప్రకటించిన నష్టపరిహారాల్లో ఆయనకు పరిహారం అందింది. దీంతో వాస్తవంగా నష్టపోయిన ఆ రైతు మొదట్లో కూడా తాను నష్టపరిహారం పొందడానికి అర్హుడనని, తన అర్హతలు పరిశీలించి తనకు న్యాయం చేయాలని న్యాయవాది ఎస్.వి.వి.ప్రసాదరావు ద్వారా హైకోర్టులో రిట్ వేశారు. ఈ కేసు పరిశీలించిన కోర్టు అతనికి మొదటి విడత పరిహారం కూడా చెల్లించాలని ఆదేశించింది. దీంతో అతనికి పరిహారం చెల్లించాలంటూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ సంఘటనతో వాస్తవంగా నష్టపోయిన ఎంతో మంది రైతులకు జగతికి చెందిన పూడి హరినారాయణ ఆదర్శంగా నిలిచారు. పోరాడి విజయం సాధించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

పలాస : వైసిపి బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయనను పట్టణ అధ్యక్షుడు శిష్టి గోపి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాడం లేదని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైసిపి ఇచ్చిన పిలుపును కట్టుబడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్, బడగల బల్లయ్య పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

టెక్కలి రూరల్ : మేకలకు, గొర్రెలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రాలో 80 శాతం మంది యాదవులు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సీజనల్ వ్యాధులకు ఇవి మృతి చెందుతున్నాయని అన్నారు. అలాంటి సందర్భాల్లో అధికారులు దృష్టికి సమస్యలు తీసుకెళ్లడం ఇన్స్యూరెన్స్‌కు అవకాశం కల్పించారని అన్నారు. అందుకు పెంపకందారులు ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని సూచించారు.

నగదు అందుకుంటున్న విద్యార్థులు

విద్యార్థినికి నగదు పురస్కారం

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినికి నగదు పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పడావో పథకంలో భాగంగా బాలికా సంరక్షణ బాలికలకు విద్యా ప్రమాణాలు పెంచే దిశలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థినులకు నగదు పురస్కారం అందజేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా బుధవారం రూ.2500 నగదు పురస్కారం, జ్ఞాపికలు అందజేశారు. బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.లావణ్య ఈ పురస్కారం అందుకుంది. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఠాగూర్ మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛను

ప్రజాశక్తి- కవిటి

ప్రతినెలా 1న లబ్ధిదారుల ఇళ్లవద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ మేరకు సచివాలయం సిబ్బందితో ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిగ్నల్ సమస్య ఉన్నా సరిచేసుకుని నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను అందించాలని అన్నారు. పింఛన్ల పంపిణీలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో సిగ్నల్ సమస్య వల్ల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛను అందించలేకపోతున్నారని అన్నారు. ఇకపై ఆ సమస్య ఉండకూడదన్నారు. సిబ్బంది తమ తమ పరిధిలో లబ్ధిదారుల సంఖ్యను బట్టి సకాలంలో పింఛను పంపిణీకి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

నేడు రణస్థలంలో బంద్

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకంగా గురువారం బంద్ ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రణస్థలం ఫ్లైఓవర్ బ్రిడ్జి వ్యతిరేక కమిటీ సభ్యులు అల్లు యుగంధర్, బలివాడ శ్రీనివాస్, ఇడదాసుల తిరుపతిరాజు, పచ్చిగుళ్ల సాయిరాం, కరిమజ్జి భాస్కరరావు, పిన్నింటి సత్యనాయుడు తదితరులు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్కింగ్ వేస్తున్నారని, కనీసం రెవిన్యూ, జాతీయ రహదారి అధికారులు హైవే పక్కన ఉంటున్న వ్యాపారస్తులకు, ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారి పనులు వారు చేసుకుంటున్నారని దీంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు తీరును నిరసిస్తూ బుధవారం ఫ్లైఓవర్ వ్యతిరేక కమిటీ సమావేశం నిర్వహించి ఎటువంటి సమాచారం లేకుండా పనులు ప్రారంభించడాన్ని నిరసిస్తూ గురువారం బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఫ్లైఓవర్ నిర్మాణం జరపకుండా బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూముల సేకరించారని భూములు ఇచ్చే రైతులు, జాతీయ రహదారుల అధికారుల మధ్య కొంత నష్టపరిహారం అందించే విషయంలో సమస్య తలెత్తడంతో బైపాస్ పనులకు పులిస్టాప్ పెట్టి మరలా ఫ్లైఓవర్ నిర్మాణం తెరపైకి తెచ్చారని ఆరోపించారు. గతంలో రహదారి విస్తరణలో చాలా మంది నష్టపోయారని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి సర్వేలు చేయడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే రణస్థలం మండల కేంద్రం పూర్తిగా వ్యాపారాలు దెబ్బతిని వందలాది కుటుంబాలు వీధీనపడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి భూములు ఇచ్చే రైతులతో మాట్లాడి బైపాస్ నిర్మాణం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వ్యతిరేక కమిటీ సభ్యులు

జిప్సం వాడితే అధిక దిగుబడి

ప్రజాశక్తి- నందిగాం

వేరుశనగ పంటలో జిప్సం వాడితే అధిక దిగుబడి పొందవచ్చునని ఎఒ పి.శ్రీకాంత్‌శర్మ అన్నారు. మండలంలోని రాజాకాశీపురం, వెంకన్నపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఎక్కరాకు జిప్సం 200 కేజీలు వాడి అధిక దిగుబడి పొందేలకు మేలు ఉంటుందని సూచించారు.

రణస్థలం రూరల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ విజయభాస్కర్

ఇచ్ఛాపురం : మండలంలో కేశిపురం, కీర్తిపురం, కొలిగాం గ్రామాల్లో ఎఒ భార్గవి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నువ్వులు, మినుములు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి మాధవీలత పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రబీ సీజన్‌లో వేరుశెనగ సాగు చేస్తున్న రైతులు నీటి ఎద్దడి లేకుండా సమాయానికి సాగునీరు పెట్టాలని ఎఒ ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలోని దుప్పిలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ కె.అప్పలరాజు పాల్గొన్నారు.

కవిటి: రబీ పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తమ తమ వివరాలను ఈ పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎఒ బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని పుక్కళ్ళపాలెం, కొజ్జిరియా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరి పంటల ఇన్స్యూరెన్స్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారి శ్రీకళ్యాణ్, లోహిత్ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయ అధికారి డి.విజయభాస్కర్ అన్నారు. మండలంలోని రణస్థలం పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ పెట్టుబడితో మెరుగైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఆధునిక సాంకేతికతని, సరైన సమయంలో నిర్ణయాలు తీసుకునే విషయ పరిజ్ఞానాన్ని అందించడమే పొలం పిలుస్తుంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణం దృష్ట్యా మొక్కజొన్నలో తెగులు, పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు పురుగు మందులు వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, వాళ్లే రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.